# ఆద్యంతాల మధ్య

ఎస్. సుందర శివరావు

"బాబాయ్, బాబాయ్. . . బాబాయ్!... నేను తంబిని. గుర్తున్నానా, బాబాయ్? చెప్పు, బాబాయ్. నువ్వెందుకు చనిపోయావు? అసలెలా చనిపోయావు? కారణమేమిటి? చెప్పు, బాబాయ్. బాబాయ్!. . ." పిచ్చిగా, ఆవేశంగా దిక్కులు పిక్కటిల్లేలా అరిచాడు విశ్వం. గొంతులో ఏడుపు ధ్వనించింది.

"బాబూ, సినబాబూ, ఏటి బాబూ, ఏటి కలవరితోన్నరు! పెద్ద కలేవేనా గన్నారా?" అంటూ కుదిపేశాడు పాలెకాపు రాజయ్య.

"ఆఁ, ఏం లేదులే, రాజయ్యా. ఎప్పుడో మా బాబాయ్ ఈ ఊళ్లోనేగా పోయేడు. అతను కళ్లలో కనిపించా డంతే. మరేం లేదు."

ఎప్పుడు నిద్ర పట్టేసిందో, స్పృహ లేనట్టు నిద్రాదేవి ఒడిలో వాలిపోయాడు విశ్వం.

"బాబూ, సినబాబూ. లెగండి, బాబూ, శానా పొద్దెక్కినాది." మళ్లీ రాజయ్య.

బద్ధకంగా ఒళ్లు విరుచుకొంటూ లేచాడు విశ్వం. రెప్ప లింకా బరువుగానే ఉన్నాయి. శరీరం ఇంకా మత్తులో జోగుతూంది. వాచీ చూసుకున్నాడు. వెక్కిరిస్తూ తొమ్మిది గంటలు చూపింది టైము.

ఈ లోపల రాజయ్య అన్నీ సిద్ధం చేసి కాలకృత్యాలు తీర్చుకొమ్మని తొందర చేశాడు. ఒక గంటలో అన్నీ ముగించుకుని రాజయ్యనికూడా తీసుకుని హోటలుకి దారితీశాడు విశ్వం.

రాజయ్యే చూస్తూంటాడు. వాడి నిజాయితీ, స్వామిభక్తీ ఈ నాటివి కావు. మూడు దశాబ్దాలనుంచీ నాన్నగారి ఉప్పు వాడి నరనరాల్లో జీర్ణించుకుపోయింది. అందుకే ఇక్కడి వ్యవహారా లన్నీ వాడిమీద వదిలేసి నిశ్చింతగా నాన్నగారు పట్నంలో స్థిరపడ్డారు.

వాడి గుడిసెలో దేవుడి పటానికి బదులు నాన్నగారి ఫోటో పూలదండలతో అలంకరించబడి ఉండటం చూసి ఆశ్చర్యపోయాడు విశ్వం. వాడి స్వామిభక్తికి ఇంతకంటె వేరే తార్కాణమేం కావాలి?

"రాజయ్యా, నీ భుక్తికి లోటు లేకుండా చూడటానికి నాన్నగా రున్నారు కదా, పెళ్లెందుకుచేసుకోలేదురా నువ్వు?"

రాజయ్య వెళ్లిన తరవాత మళ్లీ అనుకోకుండా తన ఆలోచనలు బాబాయి మీదికే మళ్లాయి. తన ఈ ఆలోచనలకి తనకే ఆశ్చర్యమేసింది. అవును, తను వచ్చిన పనేమిటి, తను చేస్తున్నదేమిటి? ఈ ఊళ్లో కాలు పెట్టినది మొదలు బాబాయే ఎందుకు జ్ఞాపకానికి వస్తున్నాడు? ఎప్పుడో ఈ లోకానికి స్వస్తి చెప్పిన బాబాయి, అందరు—ఆఖరికి నాన్నగారుకూడా మరిచిపోయిన బాబాయి తన కెందుకు మాటిమాటికీ మనస్సులో మెదులుతున్నాడు? ఇది నాన్నగారికీ, బాబాయికీ ఉన్న రక్తసంబంధం వల్లనా లేక బాబాయి మసిలిన ఊరు తను రావటంవల్లనా?

నిజానికి తనెప్పుడూ బాబాయిని గూర్చి ఆలోచించనే లేదు. ఎప్పుడో తన చిన్నతనంలో ఒకటి రెండు పర్యాయాలు అతణ్ణి చూసిన జ్ఞాపకం. అదైనా లీలగా అప్పుడప్పుడు మెదిలేది. తరవాత అదీ జ్ఞాపకం లేదు. తన చదువేమిటో తనేమిటో—అంతే.

"తొంగోండి, బాబూ! ఆ బాబేటి, ఇపుడు తవఁకి కల్లోకి రాటవేటి? ఎప్పటి బాబు, ఎప్పటి కత! తొంగోండి, బాబూ, నిద్దర సెడితే ఆరోగ్యవఁ సెడతాది. అసలే తవఁరు పెయాణంలో అల్సిపోయుండారు" అంటూ ఆప్యాయంగా తన వీపు నిమురుతూ చిన్నప్పుడు బుజ్జగించినట్టే బుజ్జగించి మళ్లీ నిద్రకు ఉపక్రమించాడు రాజయ్య.

ఎందుకో మళ్లీ మనస్సు ఎప్పుడో కాలగర్భంలో కలిసిపోయిన బాబాయి మీదికే పరుగు తీసింది. . . ఆలోచనలతో తల వేడెక్కిపోయింది విశ్వానికి. ఏ నాటి బాబాయ్, ఏ నాటి చరిత్ర!. . .

అప్పుడు తనకి నిండా ఏడేళ్లుకూడా లేవు. ఏదో కొద్దిగా ఛాయామాత్రంగా జ్ఞాపకం. అదీ అంతంత మాత్రమే.

దగ్గిరుండి నూర్పులు చేయించడానికి ఈ ఊరు వచ్చిన బాబాయి మళ్లీ ఇంటికి తిరిగి రాలేదు. తగవుల్లో ఇరుక్కున్నాడేమోననుకుంటే అటువంటిదేమీ లేదట. కానీ, అతను వెళ్లిన నెల రోజులకి కోనేటి దగ్గిరున్న పాడుపడిన దేవాలయంలో రెండు మృత దేహాలు దొరికాయట! అందులో ఒకటి బాబాయిది. ముమ్మూర్తులా తన బాబాయిదేనట! ఇంకోటి మాత్రం ఒక స్త్రీమూర్తిది. అంతే అప్పట్లో తనకు తెలిసినదీ, అవగాహన అయినదీ వృత్తాంతం.

దారిలో మళ్లీ బాబాయిని గురించే ఆలోచనలు. అసలు బాబాయి ఎలా పోయాడో, ఎందుకు పోయాడో ఎవరికీ—ఆఖరికి రాజయ్యకు, నాన్నగారికికూడా అంతు పట్టని అసాధారణ విషయమై కూర్చుంది.

ఈ ఆలోచనలతోనే హోటల్లో అడుగు పెట్టాడు విశ్వం, రాజయ్యతో సహా. భోజనం చేస్తున్నంతసేపూ తను అన్యమనస్కంగా ఉండటం గమనించక పోలేదు రాజయ్య. కాని విసుక్కుంటాడేమోనని ఏమీ ప్రస్తావించలేదు.

భోజనమయ్యాక పొలంవేపు దారి తీశాడు రాజయ్య. తనకి బాగా పరిచయమున్న పెద్దమనుషులు తోవలో ఎదురైతే వారికి విశ్వాన్ని పరిచయం చేశాడు. తను ఈ సినబాబుని చిన్నప్పుడు ఎంత గారాబంగా చూసేవాడో, ఎత్తుకుని ఎలా ముద్దాడేవాడో, ఎక్కడెక్కడ తిప్పేవాడో అన్నీ వివరించి వాడు వాళ్లతో చెబుతూంటే వాడి నిష్కల్మషమైన ఆదరాభిమానాలకి విశ్వం శరీరమంతా రోమాంచితమైంది. . .

నాన్నగారి ఆరోగ్యం సరిగ్గా లేని కారణంగా, నూర్పులు ఎలా జరుగుతున్నాయో, ఈ ఏడాది పంట ఏమాత్రం పండిందో వివరాలన్నీ తెలుసుకోవటానికి తనే స్వయంగా రావలసి వచ్చింది. ఇక్కడి వ్యవహారాలు చక్కబెట్టడం, దగ్గిరుండి భూమి సేద్యం చేయించటం అన్నీ

అడిగాడు తను ముడతలు పడుతున్న వాడి ముఖంలోకి గుచ్చి గుచ్చి చూస్తూ.

రెండు క్షణాలు మౌనం వహించాడు రాజయ్య.

"ఒక మా టడుగుతా, సినబాబూ. నే పెళ్లి సేసుగుని ఓర్ని ఉద్ధరించాల? పెళ్లి జేసుకుని కులుకుతూ కూకుంటే అయ్యగోరి సేవ ఎలా జేత్తా సెప్పండి! ఏదో ఈ పానం కాత్తా అయ్యగోరి సేవలోనే పోతే అంతేచాలు, సినబాబూ!" చాలా నిర్విచారంగా, నింపాదిగా వాడిచ్చిన సమాధానానికి తన కళ్లు చెమర్చాయి.

పొలంలోకి వెళ్లా రిద్దరూ. ఆ రోజువరకు నూర్పించిన ధాన్యం కుప్పలుగా పోసి ఉన్నాయి. ఏమాత్రం ధాన్యం పండాయో, నూర్పులు పూర్తి అయ్యేసరికి ఇంకా ఎంత కాలం పడుతుందో, కోతలు ఎప్పుడు పూర్తి చేయించాడో, పని అంతా ఎప్పటికి పూర్తి అవుతుందో మొదలైన వివరాలన్నీ సావకాశంగానే చెప్పాడు రాజయ్య.

పొలమంతా చుట్టిపెట్టి వచ్చేసరికి మధ్యాహ్నం రెండయింది. తన కిష్టమని మనుషుల్ని పంపి లేమొగడ కొబ్బరి బొండాలు తెప్పించాడు రాజయ్య.

కొబ్బరినీళ్లు తాగట మయ్యాక తనని ఒకపూరిపాక కింద విశ్రాంతి తీసుకొమ్మని చెప్పి నూర్పులు జరుగుతున్న చోటికి పోయాడు రాజయ్య.

సాయంత్రం కొంచెం చేరాక అడిగాడు: "రాజయ్యా, బాబాయ్ వృత్తాంతం ఏ కేమైనా తెలుసా?"

"ఇప్పు డేనికి, బాబూ, అదంతా? ఆ బాబుని ఈ సేతుల్తోనే మట్టి సేశాను. ఇప్పు డా కతంతా తవ్వమోకండి, సినబాబూ. అయినా ఎందు కా బాబు అనాటి పన్జేసేడో ఓరికీ తెల్దు, బాబూ!" బాధగా అన్నాడు రాజయ్య.

"పోనీ, కనీసం బాబాయ్ తాలూకు వస్తువులేవైనా నీ దగ్గిరున్నాయా?"

"ఏటి, సినబాబూ మీ పిచ్చి! అయ్యగారొచ్చి ఆ బాబు వొత్తువు లవీ తీసుకెల్లిపోతిరి. . . ఆఁ ! ఉండండి, సినబాబూ, నా కాడ ఓ పాత పుత్తకం వుండాల. . . బాబాయిగోరు ఏటో రాసేవోరందులో. అయ్యగోరు ఆ పుత్తకం సూడేనేదో, మరిసేపోయేరోగాని గుడిసె లోనే ఉండాల. సూడాల" అంటూ లేచాడు.

"ఆఁ పుస్తకమా? మా బాబాయ్‌దే? ఏదీ...ఏది, రాజయ్యా? ఏముంది అందులో?" ఆత్రంగా రాజయ్య

నిరక్షరాస్యుడన్న విషయంకూడా మరిచి ప్రశ్నలవర్షం కురిపించాడు విశ్వం.

"నా కేటి దెల్సు, సినబాబూ, ఏటి రాసుందో ఏటో, తొందలపడమాకండి. తీసిత్తా, సదవండి" అంటూ గుడిసె లోకి జొరబడ్డాడు.

పదిహేను నిమిషాలు గుడిసె అంతా గాలించి క్షీణదశలో ఉన్న ఒక పాత డైరీ వెతికి తెచ్చాడు రాజయ్య. ఆ డైరీని చూడగానే ఒక్కసారి బాబాయి ప్రత్యక్ష మైనట్టే భ్రమించాడు విశ్వం.

డైరీని చేతిలోకి తీసుకుని ఆప్యాయంగా గుండెలకి హత్తుకున్నాడు విశ్వం. తన బాబాయి రహస్యం, బాబాయి వృత్తాంతం, అతని ఆత్మహత్యకి కారణం బహుశః అందులోనే ఉండి ఉండాలి.

చెమర్చిన కళ్లు ఒత్తుకుని వణికే చేతులతో, అదిరే గుండెలతో ఒక విషాద గాథని తనలో ఇముడ్చుకోగలిగిన ఆ బరువైన డైరీ పేజీలు తిరగేశాడు విశ్వం బాధగా.

డిసెంబర్ 3: ఈ రోజు ఉదయం




సూరీడు పడమటి కొండలతో దోబూచులాడుతున్న సమయం. మెరిసి పోతున్న కృష్ణవేణి పాయల్లా ఆకాశమంతా వెండికాంతులు వెదజల్లుతూ పరుచుకుంటున్న మేఘమాలలతో పోటీలు పడుతూ కొంగలు బారులు బారులుగా గూళ్లకు చేరుకుంటున్నాయి. దూరంగా ఎక్కడో దేవాలయంలోంచి గంట విన పడింది. ఆ ప్రశాంత వాతావరణంలో వీస్తున్న మరుదంకురాలు చెవుల్లో రొదతో ఎదలోని చల్లదనాన్ని జోకొడుతున్నాయి.

పెద్ద తమాషా జరిగింది. మొట్టమొదట ఏమిటో అనుకున్నాను. కాని ఆమె చూసిన చూపు మామూలుగా లేదు. ఆర్ద్ర నయనాలతో ఆమె చూసిన చూపుకి అర్థం ఏమిటి? ఆ చూపు మరిచి పోలేను. కళ్లు మూసినా, తెరిచినా ఆమె రూపమే కళ్ల ఎదట సాక్షాత్కరిస్తూంది. ఆమె చూపులో ఆవేశం, దుఃఖం, సంతోషం, ప్రపంచంలో ఉన్న రాగద్వేషాలు అన్నీ మిళితమై ఉన్నాయి. చిత్రమేమిటంటే ఆ కళ్లెక్కడో చూసిన జ్ఞాపకం! సంవత్సరాల బాంధవ్యం, తర [illegible] త్యం ఇమిడి ఉన్నాయామె [illegible] ఎప్పుడో, ఎక్కడో, ఏదో విలువైన వస్తువు కోల్పోయి, హఠాత్తుగా చిక్కిన తరవాత వెలిబుచ్చే సంతోషాతిశయాలు నిబిడీకృతమై ఉన్నాయామె చూపులో. . . ఎవ రీమె? ఈమెకూ, నాకూ ఏమిటి సంబంధం?

డిసెంబర్ 8: సంధ్యాసమయం. కాలవ గట్టుమీద కూర్చుని ఏకాంతంగా ఆకాశంలోకి చూస్తూ మధ్యాహ్నం చదివిన ఈ విశ్వసృష్టి, ప్రాణికోటి, జీవుడు, ఆత్మ, కర్మసిద్ధాంతం మొదలైన విషయాలు మననం చేసుకుంటున్నాను. ఇక లేదా మనుకుంటూండగా ఎవరో నా ప్రక్కన నిలుచున్న శబ్దం అలికిడయింది. ఉలిక్కిపడ్డాను. తీరా మనిషిని చూశాక ప్రతిమనే అయ్యాను.

ఎదురుగా ఆమె! ఆ రోజు ఉదయం నన్ను చూపులతోనే కదిల్చివేసిన స్త్రీ మూర్తి! చుట్టుపట్ల ఎక్కడా జన సంచారం లేదు. నేను లేచి నిలుచున్నాను. నా ఎదురుగా నాలుగు అడుగుల దూరంలో మాటా మంతీ లేకుండా ఆశ్చర్యము, అంతకుమించిన సంతోషము మిళితమై చెమ్మగిల్లిన నేత్రాలతో నా వేపే చూస్తూ నిలుచుంది. . . నా ప్రమాణము, రూపము, ఛాయ విస్మయంతో పరిశీలించింది. ఆమె విస్మయం నన్నాశ్చర్యచకితుణ్ణి చేసి నోట మాట రాకుండా చేసింది.

నే నిక్కడ ఒంటరిగా కూర్చున్నానని ఆమె కెలా తెలిసిందో, ఇలా ఒంటరిగా ఎందుకు వచ్చిందో నాకు అంతు పట్ట లేదు. ఆమె పర్యవేక్షణ నాకు విడ్డూరంగా తోచింది. క్లుప్తంగా చెప్పాలంటే ఎప్పుడో చనిపోయిన ఆమె ఆప్తు లెవరో వచ్చి ఎదురుగా దర్శనమిచ్చినట్టుంది ఆమె స్థితి!

నిజానికి ఆమెని ఎన్నో అడగా లనిపించింది. "మీ రెవరు? ఎందుకు వచ్చా రిక్కడికి? నాతో మీ కేం పని? ఒంటరిగా ఇలా రావటంలో మీ ఉద్దేశ్య మేమిటి?" అని అతి ముఖ్యమైన ప్రశ్నలు వేదామనుకున్నాను. కాని ప్రయత్నించినా నాకు మాటలు పెగిలి రాలేదు. . . నెమ్మదిగా తమాయించుకుని, "మీరు. . ."

ఆమె నన్ను మాట్లాడనివ్వలేదు.

"నన్ను గుర్తించారనే ధీమాతో ఇలా తెగించి వచ్చాను. నిజంగా నన్ను గుర్తించ లేదా?" అంటూ ఎంతో నిరాశతో రెండు చేతుల్లోనూ మొహాన్ని కప్పుకుని నే నూహించని రీతిగా వర్షించటానికి సిద్ధంగా ఉన్న మేఘం గాలి తాకిడికి ధారాపాతమైనట్టు బద్దలయిం దామె.

నేను చాలా ఇరకాటంలో పడిపోయాను. ఆమె నాకు పూర్తిగా అపరిచితురాలు. ఆమెను ఏ విధంగా ఓదార్చటం? ఏమని ఓదార్చేది? ఇంతకీ ఆమెను ఓదార్చటానికి నే నెవర్ని? అయినా ఆమె అంతలా ఏడవటానికి ఏం జరిగిందని? నే నేం చేశాను?

వెంటనే తళుక్కున నా మనస్సులో ఒక ఊహ మెదిలింది. ఒకవేళ. . . మతి చలించిన మనిషేమో!. . . కాని ఆమె కట్టూ, బొట్టూ, వాలకం సునిశితంగా పరికించేసరికి నా అంచనా సరియైనది కాదనిపించింది. నేనీ విధంగా దిగ్భ్రమలో కొట్టుమిట్టాడుతూండగా ఆమె నిష్క్రమించటానికి ఉపక్రమించింది. వెళ్లబోతూ అంది:

"మీతో ఎన్నో చెబుదామని వచ్చాను. కానీ మీతో ఎలా చెప్పను? ఏమని చెప్పను? ? అయ్యో!. . ." వలవల ఏడుస్తూ తను వచ్చిన దారినే త్వరగా అడుగులు వేసుకుంటూ చీకటిలో కలిసి పోయింది.

అప్పటికి బాగా నాలుగు మూలలా చీకటి అలుముకుంది. ఆమె రావటం, మాట్లాడటం అంతా ఒక కలలా అనిపించింది. . . కానీ అన్నిటికంటే గమనించ దగ్గ విషయం ఆమె నా ఎదురుగా నిలుచున్నప్పుడు నాలో ఏదో విచిత్రమైన పరిణామం కలగడం ఆరంభమయింది! ఆమె ఒక అపరిచిత వ్యక్తి అనీ, అందులోనూ పరాయి స్త్రీ అని తెలిసి ఉండికూడా అనుకోకుండా హఠాత్తుగా ఆమెమీద ఆత్మీయత ఏర్పడి ఆమెను అక్కున చేర్చుకుందామనే ఆయత్తం నాలో ఉవ్వెత్తున పొంగింది. . . ఈ అనుభూతి, ఈ హఠాత్పరిణామం నాలో ఎందుకు కలిగాయి?

డిసెంబర్ 18: ఏమిటో రానురాను నా మనస్సంతా వికలమై పోతూంది. ఎవ రీమె? ఆమె ఉద్దేశ్యమేమిటి? నాతో ఏమిటో చెప్పాలనుకుంటూంది. ఏమిటి చెప్పదలచింది? నే నామెను గుర్తించా ననుకుందిట! ఏమిటి గుర్తించేది? నిజానికి చూచాయగా ఎక్కడో చూసిన జ్ఞాపకం. కాని ఎక్కడ, ఎప్పుడు చూశా నీమెను? అంతా చాలా విచిత్రంగానూ, అస్పష్టంగానూ ఉంది. చూడబోతే వివాహితలా ఉంది. . . ఏం మాట్లాడటానికి అవకాశం ఇవ్వదే! ఇదెక్కడి చిత్రమైన వ్యక్తి! పోనీ, తనైనా "ఫలానా" అని పరిచయం చేసుకోదే! ఏమిటో అనవసరంగా ఇక్కడికి వచ్చి రొంపిలో దిగబడుతున్నట్టు

తోస్తూంది. . . ఇదివర కెన్నడూ నా జీవితంలో ఇటువంటి సంఘటన తటస్థించ లేదు. బహుశా ఎవరి జీవితంలోనూ ఇలాంటి వ్యక్తి తారసిల్లి లేదనుకుంటాను. ఎంత ఆలోచించినా తలా తోకా తెలియ కుండా ఉంది. ఈ సంఘటన ఎలాటి పరిణామానికి దారి తీస్తుందో!

డిసెంబర్ 24: క్రమక్రమంగా నాలో మార్పు రాసాగింది. ఆమెను మళ్ళీ చూడా లనీ, ఆ అందాలరాశితో సంభాషించాలనీ నాలో తీవ్రమైన కోర్కె విజృంభించ సాగింది. అనవరతమూ ఆమె గురించే ఆలోచించటం మొదలు పెట్టాను. మళ్ళీ ఆమె కనిపిస్తే బాగుండు ననిపించసాగింది. కానీ ఆమెను ఎక్కడ కలుసుకునేది? ఎలా? రోజురోజుకీ ఆమె గురించి ధ్యాస అధికం అవుతూంది. నాకు తెలియ కుండానే ఆమె కోసం పరితపించసాగాను.

ఆఖరికి ఒక్కసారి ఆమె కనిపిస్తే చాలనిపిస్తూంది. . . ఏమిటీ పరిస్థితి? అంతా అయోమయంగా ఉంది. 'ఇంతకీ నే నెవర్ని?' అనే భయంకరమైన ప్రశ్న నాలో తలఎత్తుతూంది. . .

*    *    *

ఏదో యాథాలాపంగా కుతూహలం కొద్దీ చదవటం ప్రారంభించిన విశ్వానికి డైరీ చదువుతున్నకొద్దీ ఒళ్లంతా జలదరించసాగింది. చిరుచెమటలు తుడుచుకుని మళ్ళీ పేజీలు తిరగేశాడు.

•    •    •

డిసెంబర్ 31: అనుకున్న ప్రకారం సాయంత్రం ఆరు గంటలకి శివాలయం చేరాను. ఆలయంలో నిశ్శబ్దం నాట్యం చేస్తూంది. ఆవరణకు కాస్త దూరంలో చెట్లమీద పక్షులు ఒకటే రొద చేస్తున్నాయి. ఆలయం స్థితి శిథిలావస్థలో ఉంది. శతాబ్దాల క్రితం కట్టిన కట్టడంలా ఉంది. ఆ పాడుపడిన దేవాలయంలో నా కంటె ముందే చేరి నా కోసం నిరీక్షిస్తూం దామె!

అవే కళ్ళు. . . అదే చూపు. . . ఆ చూపులో అదే ఆవేదన, అదే లాలిత్యం, అదే నైరాశ్యం, అదే ఆశ, అదే సంతోషం. ఆమె చూపు నన్ను మరోమారు కదిల్చి వేసింది. ఆ స్థితిలో ఆమెను వీక్షించగానే చటుక్కున నా కేదో స్ఫురణకి వచ్చింది. ఈమెను ఇదివర కెన్నడూ చూడలేదు... కాని చూశాను. . . ఈమెతో ఎప్పుడూ సంభాషించలేదు...కాని సంభాషించాను. ఇది ముమ్మాటికీ నిజం, నిజం. . . నిజం. . . కాని ఎప్పుడు? ఎక్కడ? మళ్ళీ బల్లెంలాంటి ప్రశ్న!

నాలో ఏదో వివరించలేని నూతన చైతన్యం కలిగింది. ఒక్కసారిగా నాలో ఏదో అదృశ్య శక్తి ప్రవేశించి శివతాండవ మాడినట్లు. . . ఎవరో అదృశ్య రూపంలో ఉండి నన్ను నిలదీసినట్లు, కాదు, ఇంచుమించు ఆజ్ఞాపిస్తున్నట్లు, "హోరి మూర్ఖుడా, ఇంకా గుర్తించ లేవా?" అనే ఉవాచ. ఆ క్షణంలో ఆనందలహరి వెల్లువే అయింది. కాని వెంటనే హృదయం పిడచకట్టేటంత భయం వేసింది ఎందుకో!

ఏమిటో ఈ అనుభూతి ఇదమిత్థ మని నిర్వచించలేను. ఆమెను చూచినప్పటి నుండి నాలో ఏదో తీవ్రాతి తీవ్రమైన సంకుల సమరం ప్రారంభమయింది. అదే ఈ రోజు చాలా హెచ్చు స్థాయిలో ప్రజ్వరిల్లుతూంది. నాకు తెలియకుండానే ఎవరో నన్ను నెట్టుతున్నట్టు మంత్ర ముగ్ధుడిలా ఆమెకు ఎదురుగా చేరువగా నిలుచున్నాను. నేనామెకు ఎదురేగినిలుచున్న ఉత్తర క్షణంలో దిక్కులు ప్రతిధ్వనించేంత ఝుంఝూమారుతంతో—"నువ్విప్పు డెవరు?. . . ఎవరివీ కావు. . . నీ నియమాన్ని ఉల్లంఘించకు!. . . నీ ఎదురుగా ఉన్న స్త్రీ వేరెవ్వరూ కాదు. లే, కళ్ళు తెరు!" అనే దిగ్భ్రమ, ఏదో అవ్యక్తం...బెదిరింపు కాదు, మందలింపు.. మాటలతో చెప్పనలవికాని ఒక దివ్య మూర్తి అదృశ్యరూపంలోనే ఉండి నా చెవిలో మంత్రోచ్చారణ చేసినట్లు. . .

అప్రయత్నంగానే చేతులు చాపాను. అదేతడవుగా ఆమె ఒక్కసారిగా వచ్చి నా హృదయంమీద వాలిపోయింది. . . సిగ్గు ముంచుకురాగా నా గుండెల్లోనే ముఖాన్ని దాచేసుకుంది. మునుసిగ్గుతో వణుకు. . . ఆ వణుకులో అలుపు. . . అలుపునుమించిన వలపుతో, చిరుచెమటలు చెక్కిళ్లమీదుగా జాలువారుతూంటే బరువుగా మూతలు పడిన నేత్రాలతో, పరవశంవల్ల మరింత సుమధురమైన గాత్రంతో వీణ మీటినట్లే అంది:

"ఏమండీ, ఇప్పటికి నన్ను గుర్తు పట్టారా? ఇన్నాళ్లకి నేను జ్ఞాపకానికి వచ్చానా? ఏమండీ, మాట్లాడరేం? కోపమా?. . ."

ఛెళ్ళున నా వీపుమీద కొరడాతో కొట్టినట్టయింది. అరే! ఏళ్ళ తరబడి పరిచయమున్న కంఠం!! మనసు పులకింపజేసే ఆ ఆలింగనంకూడా చిరకాల పరిచయమే. . . వెంటనే ఒక తొలకరి మెరుపు! యుగయుగాల నిద్రనుండి ఉన్నట్టుండి మేల్కొన్నట్టయింది. . . హఠాత్తుగా నా కాలికింద భూమి కంపించినట్లయి ఒక్కసారిగా దిగంతాలు మారుమోగేలా ఓంకారం ప్రజ్వరిల్లినట్టయితే గట్టిగా కళ్ళు మూసుకున్నాను. ఏదో పటిష్ఠమైన చిక్కు సమస్య మంచు విడిపోయినట్లయి జ్ఞానోదయమైంది. మళ్ళీ హఠాత్తుగా మైకం కమ్మినట్లయి బాజా భజంత్రీలతో, పెళ్లివారితో కిటకిటలాడుతున్న ఒక నిండుపందిట్లో ఈ స్త్రీమూర్తి మెడలో మంగళసూత్ర ధారణ చేసిన నగ్నసత్యం నా కళ్లముందు మెరుపులా మెదలింది.

జనవరి 5: పునరపి జననం,

పునరపి మరణం
పునరపి జననీ,
జఠరే శయనం—

ఏమి టిదంతా? దీని కికఅంతు లేదా? అసలీ దేహానికి అర్థమేమిటి? భౌతిక కాయమే మిథ్య అనే వాదనలోకి వస్తే "ఆత్మ" అనే పదానికి అర్థమేమిటి? శరీరమనేదేలేకుండా, అంటే పంచేంద్రియ రహితంగా ఈ "ఆత్మ" ఎలా సంచరించ గలుగుతూంది? అన్నీ సమాధానాలు లేని ప్రశ్నలే! అయితే ఒకటి: ఈ "ఆత్మ" మాటెలా ఉన్నప్పటికీ, ఈ "జీవిత"మనే అంశాన్ని కూలంకషంగా శోధించి సూక్ష్మీకరించితే వచ్చే సమాధానం కర్మకు గతం ఉండటం ఎంత సమంజసమో, భవితవ్యం ఉండటంకూడా అంత వాస్తవమే నన్నది నిర్వివాదాంశం. . .

ఏమిటో ఆలోచించేకొద్దీ మస్తిష్కం వేడెక్కిపోతూంది. "వసంత నా భార్య. అగ్నిసాక్షిగా ఆమెను ఉద్వాహం ఆడాను" అని ఎవరితో చెప్పుకోను? ఎవరు నమ్ముతారు? ఈ నగ్నసత్యం లోకుల కెలా అర్థమౌతుంది? ఈ నా అచంచల విశ్వాసం, ఈ సత్యం నాతోనే నా చితితోపాటు భస్మమైపోవలిసిందేనా? వేరే గత్యంతరం లేదా, భగవాన్!. . .

•    •    •

డైరీ పేజీలు తిరగేస్తూంటే అప్రయత్నంగా డైరీలోంచి కిందపడిందో ఉత్తరం. ఆశ్చర్యంగా అందుకుని విప్పాడు విశ్వం.

•    •    •

— "జన్మజన్మలకీ నా ఆరాధ్యదైవమైన ఓ ప్రభూ!

( తరువాయి 54వ పేజీలో )

సద్వైద్యశాల (ప్రైవేట్) లిమిటెడ్, నంజన్‌గూడు
ఆయుర్వేద విద్వాన్ వి. వి. పండిట్ గారి నమ్మకమైన మందులు
ఇపుడు మీకు మిక్కిలి గుణము పెంపొందించబడినవి.
మీ పండ్లకు చాల ఉత్తమమైనది, నిరపాయకరమైనది.
నంజనగూడు పండ్లపొడి
అసలునే కొనండి I. D. L. 61 ఔషధయుక్తమైనది. నకళ్లను వాడవద్దు
బిడ్డలకు కాస్మస్ కస్తూరి మాత్రలు కర్జన్ గోరోజన మాత్రలు బాలక్స్ విరేచన మాత్రలు
సోల్ ఏజంట్లు: యునైటెడ్ కేసరి, 54 బందరు వీధి, మద్రాసు.
మాడిపోలు: విజయవాడ, హైదరాబాద్, పుండలిక్ అండ్ కం., సుభాన్‌రోడ్డు, సికింద్రాబాద్

> సిగ్గుపడవలసినది అందు
> కున్న శిక్షకు కాదు—చేసిన
> నేరానికే!
>
> —ఆల్ ఫేరి

# ఆద్యంతాల...

(32 వ పేజీ తరువాయి)

మనోవాక్కాయ కర్మలను పేర్కొంటూ శాస్త్రాలు ఘోషిస్తున్నాయి ఆత్మయొక్క నిర్వచనం! జన్మకీ జన్మకీ దేహం మారినా ఆత్మ ఒక్కటే. ఈ సత్యం ఎవరూ కాదనలేరు. జన్మల రహస్యం వేదాంతులకికూడా అంతు పట్టని అసాధారణ విషయమే. కాని ఆ సత్యం ఏమాత్రం తెలిసినా అది నవనాడుల్నీ క్రుంగదీసి మనిషిని జీవచ్ఛవాన్ని చేస్తుంది.

నా మెడలో "వారు" మంగళసూత్రం కట్టిన ముహూర్తమెటువంటిదోకాని ఆ క్షణం నాలో అకస్మాత్తుగా ఒక అనిర్వచనీయమైన చైతన్యం కలిగింది. తరతరాల దీర్ఘనిద్రనుంచి హఠాత్తుగా మేల్కొన్నట్టయి, ఏదో అద్వితీయ శక్తి నాలో విజృంభించి, "ఇదేమిటే, ఇదివరకే నీ మెడలో మంగళసూత్రం కట్ట బడింది! నువ్వీవరకే వివాహితవు. మళ్ళీ ఏమిటీ తంతు?" అని వెక్కిరించినట్లయింది. . .

మరుక్షణం శరీరం పట్టు తప్పినట్టయింది. ఇదమిత్థమని నిర్వచించలేని ఒక అనుభూతి మొన్నటివరకూ చెవుల్లో హోరెత్తుతూండేది నన్నెవరో పిలుస్తున్నట్లు. . . నే నిక్కడే ఉన్నాను సుమా! అంటున్నట్టు. . . అదృశ్య శక్తి వక్కాణింపు. . . గగుర్పాటు. . .

ఆ రోజు ప్రాతఃకాలం వాకిట్లో కళ్లాపి చల్లుతూంటే మీరు కనిపించారు. ఒక్కసారిగా భూ నభోంతరాళాలు బద్దలయి, నభోమండలాన మేఘాలన్నీ మటుమాయమయి చంద్రు డుదయించినట్లు, జన్మల రహస్యం విడిపోయినట్లు భ్రాంతి. . . అదే క్షణంలో మీరు నా వైపు చూచిన చల్లని చూపు! అంతకు రెండురోజులనుంచీ నాలో రగులుతున్న సంచలనం పటాపంచలై ఆనందం, ఉద్వేగం, నాలో కట్టలు తెంచుకుని పరవళ్లు తొక్కాయి!

నాలుగు నెలల క్రితం నాకు మంగళసూత్రధారణ జరిగినప్పటికీ ఈ క్షణం వరకు నేను మలినం కాలేదు. . . శరీరార్పణ చేసుకోలేదు. ఎన్ని అవాంతరాలు వచ్చినా ఈ క్షణం వరకూ నన్ను నేను కాపాడుకుంటూ వస్తున్నాను. ఇదంతా వృథాప్రయాస మాత్రమేనని నాకు తెలుసు. కానీ ఇదంతా నా ఈ కట్టెను నిష్కళంకంగానే చితిమీదకు చేరవెయ్యివ్వటం కోసం! నా ఆత్మసంతృప్తి కోసం!

ప్రభూ! ఈ వివాహం, ఈ భర్త, ఈ ఐశ్వర్యం అంతా ఒక కల మాత్రమే. మన తనువులు వేరైనా ఆత్మ ఒక్కటే. మన గుర్తింపు ఈ ప్రపంచానికి అర్థం కాదు. అది మానవాతీతమైన ఆధ్యాత్మికం. దీనిలోని సత్యాన్ని అంగీకరించేంత ఉదారత్వం మనం మసులుతున్న ఈ లోకానికి లేదు. లోకం దృష్టిలో మన బాహికపు కలయిక ధర్మవిరుద్ధం. మనల్ని భార్యాభర్తలుగా అంగీకరించలే దీ సంఘం!

ఈ జన్మలో నాకు జరిగిన వివాహం బొమ్మలపెళ్లి మాత్రమే. నా భర్త, అత్తమామలు, ఆఖరికి నా తలిదండ్రులు కూడా నా కేమీ కారు. నా కున్నదల్లా ఒక్కరే—ఇహంలోనైనా, పరంలోనైనా వారే నా ఆత్మీయులు, వారే నా దైవం, వారే నా సర్వస్వం అదే—మీరు!. . .

ప్రభూ, నా కీ లోకంలో మిగిలిందింకేమీ లేదు. ఈ అనంత సృష్టిలో మీరు తప్ప అన్నీ మిథ్యే! ఆది ఎక్కడో, అంత మెక్కడో మన ఊహకు అతీతమే అయినా మనకు తెలిసిన పరిధిలో మనకు సంబంధించినంతవరకు ఈ ఆద్యంతాల మధ్య మన దివ్యానుబంధం—అదే మన శాశ్వతానురాగం—తప్ప మరింకేమీ లేదు, ప్రభూ!. . .

కాని, ప్రభూ, మన అనుబంధం, తరతరాల అనురాగం ఈ లోకం అంగీకరించలేదు. మన కలయిక ఈ సంఘం సంకుచితదృష్టిలో సహించరాని నీచాతినీచమైన నేరం. . . కాని మీరు లేక ఏకాకిగా ఈ కట్టె నెలా ఈడ్చేది?

అయ్యో, నా క్షుభిత దగ్ధహృదయం పడుతున్న ఈ వేదన లోకాని కెలా అర్థమౌతుంది, ప్రభూ? మనల్ని వేరు చేసింది ఆ విధి. అదే మనల్ని గుర్తింప జేసిందికూడా. ఈ జీవితంలో నాకు మిగిలిం దింకేముంది, బాధాతప్తమైన, రగుల్కొని దహించివేసే ఒక్క బడబాగ్ని తప్ప!. . . కాని దాని తీవ్రతకు తట్టుకొని నిలబడగలిగే శక్తి నాకు లేదు. నేను అబలను. అందుచేత ఈ వ్యధిత జీవితాన్ని ఇక చాలిస్తున్నాను. . .

ఆఖరుసారిగా ఒక చిన్న కోరిక తీర్చమని అర్థిస్తున్నాను. మీరు వచ్చేసరికి శివాలయంలో బహుశ కొనఊపిరితో ఉంటాను. . . ప్రాణాలు అనంత వాయువుల్లో కలిసిపోయేలోపల ఒక్కసారి దర్శనం ఇస్తారుకదూ!

కనీసం పై లోక మనేదే ఉంటే అక్కడైనా మీ కోసం ఈ నాడు ఎదురు చూసినట్లే తప్పక ఎదురుచూస్తూంటాను. . . తనువు చాలించదలుచుకున్న నేను మీకు ఇంత కంటె ఏమి విన్నవించుకుంటాను?

నమస్కృతులతో,
—జన్మజన్మలకీ మీ వసంత."

* * *

కళ్లు చెమర్చి చూపు ఆనలేదు విశ్వానికి. డైరీలో అంతా గజిబిజిగా నాలుగైదు పేజీ లున్నాయి కాని ఇక చదవా లనిపించలేదు.

'బాబాయ్, ఎంత పని చేశావ్, బాబాయ్!' అని గొణుక్కుంటూ కళ్లు తుడుచుకున్నాడు విశ్వం.

ఇప్పుడు పూర్తిగా అర్థమైంది అతనికి తన బాబాయి ఎలా చనిపోయాడో...'ఒక రకంగా బాబాయి పుణ్యమూర్తి!' అనుకున్నాడు తనలో తనే.

ఎప్పటిలాగే ఆ రోజూ తెల్లవారింది. ఉదయాన్నే రాజయ్యతో మళ్లీ పొలానికి బయలుదేరిన విశ్వం దారిలో పాడుపడిన శివాలయం దగ్గిర ఆగాడు. ఒకసారి నిశ్చలంగా ఆ పరిసరాలన్నీ పరికించాడు. అదే దేవాలయం. మార్పు ఏమీ లేదు. ఆ పక్కన అదే కోనేరు!. . . కోనేటి ఒడ్డుకు నడిచి భగవంతుణ్ణి ధ్యానిస్తూ చేతులు జోడించి రెండు అశ్రుకణాలు జలజలా రాల్చాడు.

ఏమిటో అర్థంకాని రాజయ్య చిత్తరువే అయ్యాడు! ★

